నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | బుధవారం 27 డిసెంబర్ 2023 | WARANGAL HANUMAKONDA

## అంపశయ్య నవీన్‌కు 'నేరెళ్ల స్మారక ప్రతిభా పురస్కారం'


అంపశయ్య నవీన్

పోచమ్మమైదాన్ : ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్‌కు ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించారు. తెలుగు ప్రపంచంలో 34 నవలలు, 8 కథా సంపుటాలు, 5 వ్యాస సంపుటాలు వెలువరించిన గొప్ప రచయిత, ఓరుగల్లు సాహితీ కిరణం అంపశయ్యను గుర్తించి ప్రతిష్టాత్మకమైన ప్రతిభా పురస్కారాన్ని ఇవ్వనున్నారు. వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం, మిమిక్రీ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేణుమాధవ్ జయంతి సందర్భంగా ప్రదానం చేయనున్నారు. 28న హనుమకొండలోని వేణుమాధవ్ కళా ప్రాంగణంలో అవార్డును నవీన్‌కు అందజేయనున్నారు.

## 30న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్



హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26: ఈనెల 30న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ నిర్వహించనున్నట్లు వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటోడ్రైవర్స్ జేఏసీ చైర్మన్ ఎండీ అంకుషావలి, ఉమ్మడి జిల్లా జేఏసీ గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేశ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటోడ్రైవర్స్ జేఏసీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఆటోల్ బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆటోడ్రైవర్స్ ఉమ్మడి జిల్లా జేఏసీ కన్వీనర్లు దేవర మల్లేశ్, పిట్ట ప్రకాశ్, మామిడాల వెంకన్న, కోశాధికారి బండి లింగయ్య, ఉపకోశాధికారి ఓరుగంటి సదానందం, వైస్‌చైర్మన్లు పసుల యాదగిరి, జక్కుల భిక్షపతి, కస్తూరి రవి, మట్టెడ ఎల్లయ్య, మేకల ప్రభాకర్, కోకన్వీనర్లు ఎన్.నవీన్, జన్ను సదానందం, మట్టెడ నగేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క

### ప్రతిరోజు రెండు షిఫ్టుల్లో గ్రామ, వార్డు సభలు

- మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలి
- ప్రతి మండలంలో అవసరమైన మేర బృందాలను నియమించాలి
- 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసుకోవాలి
- ప్రతి దరఖాస్తుదారుడికి 4 నుంచి 5 నిమిషాల సమయం కేటాయించాలి
- దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని సభకు వచ్చేలా చర్యలు
- అధికారులు, ఉద్యోగుల పాత్ర కీలకం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష
- పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క

# ప్రజాపాలన సభలు పకడ్బందీగా జరగాలి

### 28 నుంచి జనవరి 6 వరకు పనిదినాల్లో కార్యక్రమం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన సభలను పకడ్బందీగా నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో కలిసి ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు పనిదినాల్లో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతివార్డుల్లో సభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ప్రజాపాలన గ్రామ సభ నిర్వహణ సమయం లో ప్రతి దరఖాస్తుదారుడికి 4 నుంచి 5నిమిషాలు కేటాయించాలన్నారు. దరఖాస్తుదారుడికి రూపాయి ఖర్చు కాకుండా చూడాలని, జిరాక్స్ వారు కూడా ఎక్కువ మొత్తం వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు మొదలైన పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తారని, ప్రతి గ్రామానికి ఒక రోజు ముందుగానే అప్లికేషన్లు వస్తాయని చెప్పారు. గ్రామ ప్రజలకు ముందుగానే దరఖాస్తులు అందించాలని, వాటిని ముందుగానే నింపి గ్రామసభకు వచ్చేలా చూడాలని సూచించారు. అలాగే నిరక్షరాస్యులకు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దరఖాస్తు నింపడంలో సహకరించేలా చూడాలన్నారు. గ్రామసభల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ అందిస్తామని, నిర్వహణపై మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించుకొని తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకోవాలని, ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ వార్డులో ప్రజాపాలన సభ ఎప్పుడు నిర్వహిస్తున్నామనేది ప్రజలకు తెలియజేయాలని, మున్సిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బందితో ప్రచారం చేయాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

### అధికారులు చాలెంజ్‌గా తీసుకోవాలి.. : మంత్రి కొండా సురేఖ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజాపాలన గ్రామ సభల సమయంలో ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులతో పాటు ప్రజలు తమకు ఉన్న ఇతర సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తే వాటిని పరిశీలించి జిల్లా యంత్రాంగం పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రజాపాలన విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రజలకు ఉద్యోగులు వారధులుగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా, వివిధ జిల్లాల కలెక్టర్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, శశాంక, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాషేక్, అదనపు కలెక్టర్లు పర్మర్ పింకేశ్వర్ లలిత్‌కుమార్, శ్రీజ, ఎస్పీలు సంగ్రామ్‌సింగ్‌జీ పాటిల్, గౌష్ ఆలం, కిరణ్‌ఖరే పాల్గొన్నారు.


ప్రజాపాలన నిర్వహణపై హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు


వార్షిక నివేదిక వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

# పెరిగిన నేరాలు



- ఈ ఏడాది క్రైమ్‌రేట్ 7.7శాతానికి పెంపు
- మహిళలపై 18, చిన్నారులపై 36శాతం పెరిగిన కేసులు
- ఎక్కువైన వైట్‌కాలర్ నేరాలు, దోపిడీలు, చోరీలు
- వరంగల్ పోలీసు కమిషనరేట్ 2023 వార్షిక నివేదిక
- విడుదల చేసిన సీపీ అంబర్ కిషోర్‌ఝా

సుబేదారి, డిసెంబర్ 26: ఈ ఏడాది వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు పెరిగాయి. ప్రధానంగా మహిళలు, చిన్నపిల్లలపై లైంగికదాడులు, వేధింపులు ఎక్కువయ్యాయి. గతేడాది కంటే ఈ సంవత్సరం 2023లో క్రైమ్‌రేట్ 7.7శాతం పెరిగినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సీపీ 2023 ఏడాది నేర వార్షిక నివేదికను మీడియా సమావేశంలో విడుదల చేశారు. గతేడాది 135 లైంగిక దాడి కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరం 184కి పెరిగాయి. వాటిలో మహిళలపై 18శాతం, చిన్నారులపై పోక్సో కేసులు 36శాతం పెరిగాయి. భూ వివాదాలు, చిట్‌ఫండ్స్ వంటి వైట్‌కాలర్ నేరాల కేసులు గతేడాది 1500 కాగా, ఈ ఏడాది 1994 నమోదయ్యాయి. భూ వివాదాల సంఖ్య ఈ ఏడాది మరింత పెరుగగా చీటింగ్ కేసులు 33శాతం పెరిగాయి. రోడ్డు ప్రమాదాలు గతేడాది 1,149 రోడ్డు ప్రమాదాలు కాగా, 438 మంది మృత్యువాతపడ్డారు. ఈ ఏడాదిలో 1,526 రోడ్డు ప్రమాదాలు కాగా, 487మంది మృతిచెందారు. ఈ ఏడాది 32శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. డ్రైంక్ అండ్ డ్రైవ్ కేసులు 39శాతం తగ్గాయి. దోపిడీలు, చోరీలు 36శాతం ఎక్కువయ్యాయి.

### కఠినంగా వ్యవహరిస్తాం : సీపీ

క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్, చిన్నారుల పోక్సో కేసులు పెరగడం బాధాకరమని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. 1,167 మంది ఉమెన్ మిస్సింగ్ కేసుల్లో 90శాతం ట్రేస్ చేసినట్లు చెప్పారు. వరంగల్ అర్బన్‌లో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో రూ.12కోట్లు పట్టుకున్నామని, గంజాయి ఇతర కేసుల్లో 18మందిపై పీడీ యాక్టులు పెట్టామని వివరించారు. ఇంటి వద్దకు వచ్చి మాయమాటలు చెప్పి మోసం చేసేవారిపై జాగ్రత్తగా ఉండాలని, భూకబ్జాలు, చిట్‌ఫండ్ మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇయర్ ఎండింగ్ ప్రోగ్రామ్స్‌పై ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, 31న డ్రంక్ అండ్ స్పెషల్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. డీసీపీలు బారీ, రవీందర్, సీతారాం, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి శివైక్యం



కాజీపేట, డిసెంబర్ 26 : హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం విష్ణుపురిలోని శ్వేతార్క మూల గణపతి దేవాలయ వ్యవస్థాపకుడు, భద్రకాళి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి, రాష్ట్ర విద్వత్ సభ ఉపాధ్యక్షుడు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి(60) అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం శివైక్యం చెందారు. తల్లిదండ్రులు అయినవోలు పుష్పలత, వెంకటేశ్వరశర్మ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నందనం గ్రామం నుంచి బతుకుదెరువు కోసం హనుమకొండ జిల్లా (ఉనికిచర్ల), దేవన్నపేటకు వలస వచ్చారు. అనంత మల్లయ్య శర్మ 18 నవంబర్ 1963లో అక్కడే జన్మించారు. ఈ ఏడాది నవంబర్ 18వ తేదీన 60వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. భద్రకాళి దేవస్థానానికి పదేండ్లకు పైగా ఆస్థాన సిద్ధాంతిగా కొనసాగారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధి బాధపడగా, ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్సపొందుతూ మరణించారు. ఆయనకు భార్య శారదాదేవి, కుమారులు రాధా కృష్ణశర్మ, సాయి కృష్ణ శర్మ ఉన్నారు. కాగా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, ఎలకంటి రాములు, జక్కుల రమా రవీందర్‌యాదవ్ సంతాపం తెలిపారు. అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి అంత్యక్రియలు కాజీపేట పట్టణంలో బుధవారం నిర్వహించనున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

# 28 నుంచి ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్

- మూడు రోజులపాటు నిర్వహణ
- 30 ఏండ్ల తర్వాత వేదికైన కేయూ
- కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26: ఈనెల 28 నుంచి 30 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 82వ సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ తెలిపారు. మంగళవారం కేయూ సెనెట్‌హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ దేశంలోనే కాదు దక్షిణ ఆసియా లోనే వృత్తిపరమైన చరిత్రకారుల అతి పెద్ద సంస్థ అని వెల్లడించారు. భారత ఉపఖండంలో 35వేల మంది చరిత్రకారులు, చరిత్ర బోధకులు సభ్యులుగా ఉన్న సంస్థ నిర్వహిస్తున్న ఈ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 30 ఏండ్ల తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయం వేదికవుతుందని తెలిపారు. 1993లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వైస్ చాన్స్‌లర్‌గా, చరిత్ర విభాగ ప్రొఫెసర్ బొబ్బిలి విభాగాధిపతిగా ఉన్నప్పుడు నిర్వహించినట్లు చెప్పారు. మూడు రోజులు మొత్తం ఆరు సెషన్‌లలో ప్రాచీన భారతదేశం, మధ్య యుగ భారతదేశం, ఆధునిక భారతదేశం, భారతదేశం ఇతర దేశాల చరిత్రతోపాటు ఆర్కియాలజీ, సమకాలీన భారత చరిత్రపై సెషన్‌లు ఉంటాయని, వీటితోపాటు రెండు ప్రత్యేక ఉపన్యాసాలు ప్రొఫెసర్ ఎస్‌సీ మిశ్రా మెమోరియల్ లెక్చర్, సనాతన హ్యూమనిజం అనే అంశంపై, ఒక సింపోజియం 'రీజన్ అండ్ ఐడియాలజీ ఇన్ ఇండియన్ హిస్టరీ' అనే అంశంపై జరుగుతాయని, మొత్తం 1,030 పరిశోధన పత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆచార్య సయ్యద్ అలీ నదీం రేజావి మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని, చరిత్ర జీవిత సాఫల్య పురస్కారం, రూ.50వేల నగదు బహుమతి ప్రొఫెసర్ రామచంద్రగుహకు అందజేస్తామని తెలిపారు. ఉత్తమ పుస్తకానికి ఇచ్చే అవార్డు ప్రొఫెసర్ కేఎం శ్రీమాలికి అవార్డుతోపాటు రూ.50వేల నగదు బహుమతి అందజేస్తామని, వివిధ రకాల చరిత్ర పుస్తకాల్లో మరో ఆరు అవార్డులు అందజేస్తామని, 2022లో చెన్నై మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో చివరి సెషన్‌లో సమర్పించిన 11 మంది యువ పరిశోధకుల పరిశోధన పత్రాలకు అవార్డులు, బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు. 28న వీసీ రమేశ్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు, న్యూ ఢిల్లీ నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ పూర్వపు సంచాలకుడు డాక్టర్ మ్రిదుల ముఖర్జీ విచ్చేస్తారని, అతిథులుగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్ ఆదిత్య ముఖర్జీ, కార్యదర్శి ఆచార్య ఎస్ఎఎన్ రేజవి, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస రావు, 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ ఆచార్య టీ మనోహర్ పాల్గొంటారని, 30న జరిగే ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విచ్చేస్తారని తెలిపారు. రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ లోకల్ సెక్రటరీ ఆచార్య టి.మనోహర్, విశ్రాంత చరిత్ర విభాగ ఆచార్యులు ఎస్.శ్రీనాథ్ పాల్గొన్నారు.


సోమయ్య, సుదర్శన్ (ఫైల్)

# అంత్యక్రియలకు వెళ్లొస్తూ..

### బైక్‌ను బస్సు ఢీకొట్టడంతో అన్నదమ్ముల మృతి

హసన్‌పర్తి/ధర్మసాగర్, డిసెంబర్ 26: అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని బావుపేట వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సీఐ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు సోమయ్య(55), బొడ్డు సుదర్శన్(58)లు అన్నదమ్ములు. బాహుపేటలో వారి బంధువులు మృతి చెందగా మంగళవారం బైక్‌పై అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బావుపేట క్రాస్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి వరంగల్‌కు వస్తూ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. అన్నదమ్ములు మృతి చెందడంతో ధర్మసాగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, బొడ్డు సోమయ్య భార్య శోభ ఎంపీటీసీ. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య ఎంజీఎం దవాఖాన వద్ద మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి వారికి మనోధైర్యం కల్పించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# సింగరేణి ఎన్నికలకు సర్వం సిద్ధం



### నేడు ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్

- సాయంత్రం 7గంటల నుంచి కౌంటింగ్, రెండు రౌండ్లలో ఫలితాలు
- భూపాలపల్లి ఏరియాలో 9 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 5,410మంది కార్మికులు


భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 5 ఇంక్లైన్‌లో ఎన్నికల కోసం చేసిన ఏర్పాట్లు

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : నేడు సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్లలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకోసం భూపాలపల్లి ఏరియాలో యాజమాన్యం ఏర్పాట్లు పూర్తిచేసింది. తొమ్మిది పోలింగ్ కేంద్రాలు, అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్‌లో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. సాయంత్రం 7 గంటల నుంచి లెక్కింపు ప్రారంభించి అర్ధరాత్రి వరకు ఫలితాలు వెల్లడించనున్నారు. పోలింగ్ కోసం 68మంది సిబ్బందిని నియమించగా 109 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. భూపాలపల్లి ఏరియాలో 5,410 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 13 కార్మిక సంఘాలు బరిలో నిలువగా నేడు రాత్రి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల భవితవ్యం తేలనుంది. 5 టేబుళ్లను ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ నరేశ్‌కుమార్ సింగరేణి అతిథి గృహంలో పోలింగ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి బ్యాలెట్ బాక్స్‌లను అందజేశారు. డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం నుంచి ఐదుగురు బృందం భూపాలపల్లికి చేరుకుని ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు.

### తొమ్మిది పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

సింగరేణి గుర్తింపు ఎన్నికల కోసం సింగరేణి యాజమాన్యం 9 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేటీకే-1 ఇంక్లైన్ వెల్ఫేర్ కార్యాలయంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయగా 596మంది ఓటు హక్కును వినియోగించుకుంటారు. అలాగే ఇదే గనిపై సర్వే రూంలో ఏర్పాటుచేసిన రెండో కేంద్రంలో 671మంది, కేటీకే-5 ఇంక్లైన్‌లో పీవోఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మూడో కేంద్రంలో 680మంది, ఇదే గనిపై వెల్ఫేర్ అధికారి కార్యాలయంలోని నాలుగో కేంద్రంలో 691మంది, కేటీకే-6 ఇంక్లైన్‌లో ఏర్పాటు చేసిన ఐదో కేంద్రంలో 712 మంది, లైటింక్లైన్‌పై ఉన్న ఓసీ సైట్ ఆఫీస్‌లోని ఆరో పోలింగ్ కేంద్రంలో 582మంది, ఇదే గనిపై క్యాంటీన్ హాల్‌లో ఏర్పాటుచేసిన ఏడో కేంద్రంలో 650మంది, మైన్స్ రెస్క్యూ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎనిమిదో కేంద్రంలో 572మంది, ఓసీ-2 సైట్ ఆఫీస్‌లో ఏర్పాటుచేసిన తొమ్మిదో పోలింగ్ కేంద్రంలో 256మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.